# దొంగలు బాబోయ్ దొంగలు!

అన్నారావు కన్నారావు సున్నారావు ముగ్గురూ మంచి మిత్రులే కాదు... అత్యంత ఆత్మీయులు!

ముగ్గరూ ఒకే సారి పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరారు. ఒకేసారి రటైరయ్యారు.

వారి బంధం విడదీయలేనిది. ముగ్గరి కులాలు వేరైనా.... ఒకరి పిల్లలను మరొకరు.... మరొకరి పిల్లలను ఇంకొకరు చేసుకుని బంధుత్వాలు కూడా కలుపుకుని మరింత దగ్గరైనారు.

సర్వీసులో వుండగా ముగ్గురూ వుద్దండులే! సంపాదించటానికి వారికున్న రెండు చేతులూ చాల్లేదు. వారు తినటమే కాదు పైవారికీ తినిపించారు.

ముగ్గరూ మూడుసార్లు ఉత్తమ పోలీసు అధికారి మెడల్స్ పొందిన ఘనులు.

యస్సైలుగా చేరి యస్పీలుగా ఎదిగారు. లంచాలు పుచ్చుకోవటంలో ఒకరికొకరు ఏమాత్రం తీసిపోరు.

బినామీ పేర్లతో స్థలాలు...పొలాలు.. ప్లాట్లు... బేంకు లాకర్స్‌లో బోలెడు బంగారం... వెండి.... చెరుకు తోటలు... సినిమా హాళ్లు.... ఒక్కటేమిటి... వారికి లేని దంటూ లేదు.

వన్‌ఫైన్ మార్నింగ్ ముగ్గురు మిత్రులకి ఓ బ్రహ్మాండమైన ఆలోచనొచ్చింది.

ముగ్గురుకీ ఒకే విధమైన ఆలోచన కలగటం 'కో-ఇన్సిడెన్స్'. అది వాళ్లు చేసుకున్న పూర్వజన్మ సుకృతం! అందుకే పోలీసు డిపార్ట్‌మెంట్ వాళ్ల ముగ్గర్నీ అక్కున చేర్చుకుంది. జీతాలిచ్చింది. ఇంక్రిమెంట్లిచ్చింది... ప్రమోషన్ లిచ్చింది. మెచ్చి మెడల్స్ యిచ్చింది.

ఓ రోజు రాత్రి అన్నారావు గారి ఇంట్లో ఎ.సి. గదిలో మిగతా ఇద్దరూ కలిసి... ముగ్గరూ ఏకమై ఫారిన్ లిక్కర్ లాగిస్తూ... చికెన్ ముక్కలు...జీడిపప్పు బద్దలు నములుత్తూ వారి కొచ్చిన ఐడియా గురించి ముచ్చటించుకోసాగారు.

"పురాణాల్లో చెప్పినట్లు... అష్ఠకళల్లో చోర కళకూడా ఒకటి! ఈ విషయం మీ ఇద్దరికీ తెలుసా? - "స్నేహితులిద్దరి ముఖాల్లోకి తేరిపార చూచి సంభాషణ మొదలు పెట్టాడు అన్నారావు.

కన్నారావు సున్నారావులు ఒకరి ముఖాలొకరు చూచుకుని అన్నారావ్ వేపు చూస్తూ తమకా విషయం తెలీదన్నట్టు తలలు అడ్డంగా ఆడించారు.

"అవును మరి... ఏనాడైనా మన పురాణ గాథలు చదివితేగా?... ఇకనైనా చదివి విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోండి!- ఉచిత సలహా పారేశాడు అన్నారావు!

"దొంగ తనం చెయ్యటం అంటే మాటలా... ఎంత తెగింపు గుండె ధైర్యం కావాలి? ... ఓర్పు, నేర్పు రెండు చాలా అవసరం.. ఇది మాత్రం నాకు తెల్సు!-"సున్నారావు గొంతులో మందు పోసుకుని చెప్పాడు.

"ఆ మాత్రం నాకూ తెల్సు! పోలీసు వాడినై వుండి...మనకావిషయాలన్నీ ప్రత్యేకంగా ఎవరైనా చెప్పాలా ఏంటి?-" నవ్వి సిగరెట్ వెలిగించాడు కన్నారావు.

"అది సరేగానీ... నే చెప్పేది జాగ్రత్తగా వినండి! కొత్తరకమైన వ్యాపారం మన మొకటి చెయ్యబోతున్నాం... తెల్సిందా?-" అన్నారావు అన్నాడు.

"నువ్వు చెప్తేగా తెలీటానికి?-వ్యాపారానికి పెట్టుబడి ఎంత అవసరమౌతుంది." సాలోచనగా అండిగేడు సున్నారావు.

"తొందర పడకు. అన్నీ అన్నారావే చెప్తాడు.." సున్నారావు భుజం తడుతూ అన్నాడు కన్నారావు.

"ప్రతి మనిషిలోనూ ఓ దొంగ దాగి వుంటాడనే సత్యాన్ని మనం ఎవ్వరం కాదన్లేం"

"అంటే... పోలీసు అఫీషియల్స్‌మైన మనలో కూడానా...?" ముక్త కంఠంతో అడిగారు.

"అవును.. నిస్సందేహంగా! - దొంగ చూపులు.. దొంగ బుద్ధి... దొంగాట...ఇంటి దొంగలు...దొంగ దెబ్బ తీయటం...ఇన్ని రకాల మాటలు వాడుకలో వున్నాయనే నిజం మనకు తెలుసుకదా.." చెప్తూ ఆగి ఎదురుగావున్న ఇద్దరి ముఖాల్లోకి చూశాడు అన్నారావు.

"అబ్బ!-ఇప్పుడా దొంగల గురించి మాట్లాడు కోవటం దేనికి. నలభై యేళ్ళ సర్వీసులో దొంగలతో డీల్ చేసి చేసి విసిగిపోయాం..." సోఫాలో వెనక్కువాలి రిలాక్సయ్యాడు సున్నారావు.

"మన మేదైనా కొత్త తరహా బిజినెస్ చేస్తే బావుంటుందనిపిస్తోంది..." మనసులో మాటబైటపెట్టాడు కన్నారావు.

"నేను చెప్పబోయేది అదే! ఆ మధ్య నేనొక ఇంటర్‌నేషనల్ ఇంగ్లీషు మేగజైన్లో చదివాను. అలాంటి వ్యాపారాలు కూడా చేస్తారాని ముక్కుమీద వేలేసుకుని నమ్మలేక పోయాను".

"నువ్వు చదివిందేమిటో వివరంగా చెప్పు అన్నారావ్!-" సున్నారావు అడిగాడు.

"అదేదో దేశంలో క్రిమినల్స్‌ని తయారు చేయటానికి ప్రత్యేకంగా ఓ కాలేజీ ప్రారంభించారు..." క్లుప్తంగా చెప్పాడు.

"నాన్సెన్స్! నేరస్తులను తయారు చేయటమా? - ఐడోన్ట్‌బిలీవ్!!-" తాగింది దిగిపోయి నట్టన్పించింది కన్నారావుకి.

"ఫిలింయాక్టింగ్‌కోర్సు... జర్నలిజం కోర్స్...వగైరా వగైరా బోలెడన్ని ట్రైనింగ్ సంస్థల్లేవూ? అలాగే దొంగతనం నేర్చుకోవటంలో కూడా ఒక ట్రైనింగ్ కోర్స్ పెడితే..." ఇంకా ఏదో చెప్ప బోయి ఆగాడు అన్నారావు.

"అప్పుడుగాని... మనల్ని రిటైర్డ్‌పోలీస్ అధికారులని కూడా చూడకుండా.. తీసుకెళ్లి కటకటాల వెనక కూర్చోపెట్టరు! పోయిపోయి .. నీ కీలాంటి దిక్కుమాలిన ఆలోచన వచ్చిందేమిట్రా బాబూ?!" పిచ్చి పిచ్చి పన్లు చేస్తే వాటి పర్యవసానం ఎలా వుంటుందో క్లుప్తంగా చెప్పాడు కన్నారావు.

స్నేహితుల సంభాషణలింటూ కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తున్నాడు సున్నారావు.

అసలీదొంగతనాలనేవి ఈనాటివి కావు... అనే సత్యాన్ని చరిత్ర చెప్తోంది.. రాజుల కాలంలో దొంగలుండేవారు కాదా?... దారి దోపిడీలు లేవా ఏమిటి?... అదే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. అందుకేమంటావ్?-ఆ రోజుల్లో సోమరులు.. మూర్ఖులు... వంటి వారు చౌర్యానికి పాల్పడేవారు.నేడో... నిరుద్యోగులు.. ఉద్యోగులు... రౌడీలు...అధికారులు... అనధికారులు... ఒక్కరేమిటి స్త్రీలు సైతం దొంగతనాలకు పాల్పడటం మనకు తెలీదా?!.. పట్టుబడ్డ వాడు దొంగ... దొరకని వాడు దొర అనే సామెత ఉండనే వుంది!... వాస్తవాన్ని చెప్పి పకాలున నవ్వాడు అన్నారావు.

"చోరీలు ఎవ్వరైనా చెయ్యమని చెప్తుంటేనే చేస్తున్నారా? వద్దన్నా.. జైలు శిక్ష వేసినా... మరో విధంగా దండించినా దొంగతనాలు...దోపిడీలు... జరుగుతున్నాయి కదా!-అలాంటప్పుడు మనం ఓ సంస్థ స్థాపించి నిపుణులైన దొంగలను తయారు చేస్తే తప్పేమిటీ అంట?-?-" ఎదురుగా వున్న టీ పాయ్ మీద గుద్ది మరీరెట్టించి మాట్లాడాడు అన్నారావు.

"నీ వాదనను కేవలం కొట్టి పారేయలేం?-దొంగతనాలనే వృత్తిగా పెట్టుకున్న వారెందరు లేరు... స్టువర్ట్‌పురం దొంగలు దొంగతనాలకు పెట్టింది పేరు. అలాగే ఇంకా ఎన్నో గ్రూపులున్నాయ్ -నేరం చేసినా వాళ్ళని శిక్షించినంతమాత్రాన తర్వాత గాంధీ మహాత్ములైపోతున్నారా ఏం?-" కన్నారావు శృతి కలిపేడు.

"ఐ ఎగ్రీ విత్‌యు! ఎందరిని మనం పట్టుకోలేదు?! ఎంత మంది దొంగలకు కోర్టు శిక్షవిధించలేదు?.. అయినా మార్పు వారిలో రాలేదు! ఎందుకని?-ఈజీ మనీ ఎర్నింగ్‌కి అలవాటు పడటమన్నమాట!..."తనకు తోచింది మాట్లాడాడు సున్నారావు.

"అసలు నన్నడిగితే నిష్ణాతులైన చోరులను మనం ఆహ్వానించి వాళ్ల చేత కొత్త కేండిడేట్స్‌కి క్షుణ్ణంగా ట్రైనింగ్ ఇప్పిస్తే సరి. ట్రైనింగ్ కోర్స్‌కి కావలసిన సిలబస్ మనమే తయారు చేద్దాం! మన కంటే పెద్ద దొంగలెవరున్నారు కనుక!-" తన ప్రతాపం గురించి ఘనంగా చెప్పకోవటానికి వెనకాడలేదు కన్నారావు.

ఫుల్ బాటిల్ ఖాళీ అయిందీ, మాటల్లో పడి టైమెంతైందో కూడా మర్చిపోయారు.

అప్పటికి సభ చాలించి ముగ్గురూ ఎవరింటికి వారు వెళ్లిపోయారు.

★★★★★

యాచక వృత్తిని మాన్పించాలని యోచించిన మున్సిపాల్టీ అధికార యంత్రాంగానికి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పని వారి వల్ల కాక చేతులెత్తేశారు.

ఫుట్‌పాత్ ఆక్రమణదారులను తరలించాలని చేసిన ప్రభుత్వ ప్రయత్నం బెడిసి కొట్టింది.

అలాగే... దొంగతనాలను అరికట్టాలని చేస్తున్న ప్రయత్నాలు... తీసుకుంటున్న చర్యలు... విధించే శిక్షలు.. దొంగలను ఏమీ చేయలేకపోతున్నాయి...ఇది జగమెరిగిన సత్యం.

లంచాలు పుచ్చుకోవద్దని నెత్తినోరు కొట్టుకున్నా.. ఎ.సి.బి. వారికి పట్టుబడి.. కోర్టు శిక్ష విధించినా అవినీతిని నిర్మూలించటం సాధ్యం కావటం లేదు.

ఒకరు చెప్తే వినే రోజులు కావు. కన్నవారు హితవు చెప్తుంటే... కడుపున పుట్టినవారే వినటం లేదు. అలాంటప్పుడు... ఇలాంటి వాటిని అరికట్టి దోషులను సరైన మార్గంలో పెట్టాలనుకోవటం కేవలం వెర్రితనం!

ఎవరి పని వారు చేసుకుపోతూంటారు ఈ సమాజంలో! దట్సాల్!!

కటికవాడు జంతువులను నరుకుతాడు. హంతకుడు హత్యలు చేస్తాడు.. చోరులు దొంగ తనాలకి పాల్పడుతూనే వుంటారు. లంచగొండులు నిర్విరామంగా మేస్తూనే వుంటారు. రాజకీయనాయకులు నెరవేర్చని వాగ్దానాలు చేస్తూనే వుంటారు.

అందరూ దొంగలే!

ఎందరి వద్ద బ్లాక్ మనీ లేదు..? దొంగ నోట్లు ఎందరు ముద్రించటం లేదు...? నకిలీ డాక్టర్లు.. మందులు... డిగ్రీ సర్టిఫికేట్లు... కేస్ట్‌సర్టిఫికేట్లు... వక్కటేమిటి? అంతా ఓపెన్ సీక్రెట్టే! అధికార యంత్రాంగం దానిపని అది చేసుకుపోతూంటుంది చూసిచూడనట్టు.

కొందరు ఆఫీసులో స్టేషనరీ ఐయిటమ్ ఇంటికి చేరవేస్తూంటారు. అధికారుల ఇళ్ళల్లో ఆఫీసు ఫర్నిచర్ వుంటుంది. పట్టుబడిన బంగారాన్ని పోలీస్టేషన్లో పంచుకుంటారు. పోగొట్టుకున్న వారికి ఎంత చేరుతోంది?

ప్రతి మనిషిలో దొంగ దాక్కుని వున్నాడు. చిన్న వయసులో అవసరాలు తీరక డాడీ జేబులోంచి చిల్లర కన్నకొడుకే కాజేస్తాడు. కట్టుకున్న భార్య సైతం హస్తలాఘవం ప్రదర్శిస్తూంటూంది!- ఇలాంటివి దొంగ తనం క్రిందికి రావా?

ఒక్కొక్కరికి జ్ఞానోదయమై...తెలివి తెచ్చుకుని...తప్పు తెల్సుకుని... తమనితాము

సరిదిద్దుకుని ప్రయోజకులవుతారు.

అలాంటి మార్పు కోరుకోనివారు దొంగలుగానే మిగిలి పోతారు! వారు ఎంతటి వారైనా కావచ్చు.

★★★★★

నగరం నడి బొడ్డున నిత్యమూ రద్దీగా వుండే ప్రాంతంలోగల బంగారు ఆభరణాల కొట్లో దొంగతనం జరిగిందనే న్యూస్ తెలుసుకున్న పోలీసు యంత్రాంగం వులిక్కిపడింది. గుండెల్లో రైళ్లు పరుగెత్తినయ్.

క్షణాల్లో రెక్కలు కట్టుకు వాలేరు పోలీసు అధికారులు... పేపరు వాళ్లు...మీడియా వారు.

వేలిముద్ర నిపుణులను రప్పించారు. వెనువెంటనే పోలీసు జాగిలాలు వచ్చాయి.

లక్ష రూపాయల ఖరీదు చేసే బంగారు నగల్ని దొంగలు దోచుకు పోయినందుకు దుకాణ దారుడు భోరుమన్నాడు. గుండెలు బాదుకున్నాడు.

పోలీసు అధికారుల్లో రకరకాల వ్యూహాగానాలు! ప్రశ్నల మీద ప్రశ్నలు వేశారు. దుకాణం యజమానికి విరోధులెవరైనా వున్నారా? బెదరింపు ఫోన్ కాల్స్ లాంటివి ఏవైనా వచ్చాయా?... కొట్లో పని చేసేవారి పని అయివుంటుందా? ఇంకా అనేక కోణాల్లో ఆలోచిస్తూ ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు.

సిటీలోకెల్లా పేరున్న పెద్ద నగల దుఖాణంలో ఘోరమైన దొంగతనం జరగటం మూలాన హోమ్‌మంత్రిగారు సైతం స్వయంగా విచ్చేసి పరిస్థితిని సమీక్షించారు.

ఎంతో పగడ్బందీగా నేర్పుతో దొంగతనం జరిగిందీ అంటే... ఇది తప్పకుండా అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాపనే అయివుంటుందనే నిర్ణయానికొచ్చారు హోమ్ మంత్రివర్యులు.

దొంగలు ఎతంటి వారైనా... ఎక్కడున్నా....తప్పక పట్టుకు తీరతామని దుకాణం ఓనర్‌కి ధైర్యం చెప్పి వచ్చిన వారంతా ఎవరి దోవన వారు చేతులు దులుపుకొని వెళ్లిపోయారు.

సిటీలో ఇలాంటి దొంగ తనాలతో లోగడ సబంధాలున్న నేరగాళ్ళందరినీ పోలీసు స్టేషన్‌కి ఈడ్చుకొచ్చి ప్రశ్నించారు.కాని ప్రయోజనం లేకపోయింది.

పోలీసు జాగిలాలు తోవంతా వాసన చూచు కుంటూ రైల్వేస్టేషన్ వరకు వెళ్లి ఆగిపోయినయ్.

అంటే దొంగతనం చేసిన వారు రైల్వే స్టేషన్ చేరుకుని దూర ప్రాంతాలకు వెళ్ళి పోయి వుండవచ్చనే అభిప్రాయానికొచ్చారు పోలీసులు!

పోలీసులను నాలుగైదు జట్లుగా ఏర్పడి ఢిల్లీ... ముంబాయి.. కలకత్తా.. నగరాలకు

నేరగాళ్ళ ఆచూకీ తెల్సుకోవటం కోసం పోవటం జరిగింది.

దొంగతనం జరిగిన దుకాణంలో లభించిన వేలిముద్రల పరీక్షించాక.. అవి పాత నేరగాళ్ళెవ్వరివీ కావనే నిర్ధారణ కొచ్చారు పోలీసు అధికారులు.

★★★★★

మఫ్టీలో వున్న పోలీసులు ముంబాయ్ చేరుకుని అక్కడ స్థానిక పోలీసుల సాయంతో దొంగతనం చేసిన వస్తువులను కొనేషాపులున్న వీధిలో కెళ్ళారు.

నాలుగైదు దుకాణాల్లో విచారించారు. ఓ చోట అధారాలు దొరకటంతో దుకాణాదారుడని నిర్భంధించి నిజం రాబట్టారు.

ముగ్గురు కుర్రాళ్ళు.... బాగా చదువుకున్నావారిలా స్టైల్‌గా... దర్జాగా వచ్చి నగలు మాకు అమ్మి డబ్బు తీసుకెళ్లారంటూ...తాను కొన్న నగలు చూపించాడు. నిజం వప్పుకున్నాడు.

చూపించి నగలను గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీన పర్చుకుని... బంగారపు కొట్టువాడు చెప్పిన వివరాలను ఆధారంతో ఓ మధ్య తరగతి లాడ్జి దగ్గరకు చేరుకున్న పోలీసులు రిసెప్షన్‌లో విచారించి పై అంతస్తులో వున్న గది వైపు నడిచారు.

తలుపు తట్టేరు!

తలుపు తేరుచుకోగానే గదిలో నున్న ముగ్గురినీ పోలీసులు చుట్టుముట్టారు.

సోదా చేసి వారి సూట్ కేసుల్లో వున్న నగలు స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన ముగ్గురికీ పరిస్థితి బోధపడింది.పోలీసులకు దొరికి పోయినందుకు బెంబేలు పడ్డారు.

వంటిమీద లాఠీలు నాట్యం చేయటంతో ముగ్గురూ వలవలా ఏడుస్తూ "మాతో పాటు మరో ఇద్దరున్నారు సార్.. వాళ్లు ఢిల్లీలో వున్నారు. అసలు వ్యూహ కర్తలు వారే! మేమూ వారితో చేతులు కలిపినందుకు కొన్ని నగలు మాకిచ్చారు. ఉన్న వూళ్లో కుదరదని పట్టు బడతామేని భయమేసి వాటిని అమ్మి సొమ్ము చేసుకోవాలని ఇంతదూరం వచ్చాం. కొన్నాళ్లు జల్సాగారోజులు వెళ్ల బుచ్చి తిరిగి ఇంటికెళ్లి పోవాలని ప్లాన్ వేసుకున్నాం మేమిద్దరం! కానీ... ఇంత లోనే మీకు దొరికి పోయాం! మేము చదువు కుంటున్న స్టూడెంట్స్‌ము సార్... గౌరవమైన కుటుంబం మాది.. పేరెంట్సుకి ఈ విషయం తెలిస్తే మమ్మల్ని బతక నీయరు. తప్పైపోయింది. దయచేసి మమ్మల్ని విడిచి పెట్టండి సార్..." దీనంగా వేడుకుంటూ పోలీసు అధికారుల కాళ్ల మీద పడ్డారు.

పోలీసు వారిలో ఇసుమంతైనా దయాదక్షిణ్యాలు కన్పించక పోవటంతో... జైలు జీవితం

అనభవించటానికి మనస్కరించక... కన్నవారికి ముఖాలు చూపలేక.. ఒక్క వుదుటున లాడ్జి రూమ్‌లోంచి తప్పించుకుని బైటికొచ్చి బాల్కనీలోంచి ఆత్మహత్యే శరణ్యమని తోచి అక్కడ్నించి కిందికి దూకారు.

అనుకోని మలుపుతిరిగిన సంఘటన చూస్తున్న పోలీసు బృందం దిగ్భ్రాంతికి గురైంది.

గబగబా లిఫ్టులో కిందికొచ్చారు. అప్పటికే రెండు శవాలు నెత్తుటి మడుగులో కన్పించినయ్.

శవాలను మార్చురికి తరలించారు. ఆత్మహత్య నేరం క్రింద కేసు నమోదు చేసుకున్నారు.

★★★★★

మార్నింగ్ వాక్ నుంచి తిరిగొచ్చిన అన్నారావు కన్నారావులు టీ చప్పరిస్తూ టీపాయ్ మీదున్న న్యూస్ పేపర్ అందుకున్నారు.

ఫ్రంట్ పేజీలో వున్న తమ కొడుకుల ఫోటోలు చూచి నివ్వెర పోయారిద్దరూ! ఫోటో క్రింద వున్న మేటర్ చదివి భోరుమన్నారు.

ఒకనాటి పోలీసు అధికారులైన తమ పిల్లలు దొంగలుగా మారి మృత్యువాతపడినందుకు గుండెలు అవిసేలా ఏడ్చారు. ఇలా జరుగుతుందని వారేనాడూ వూహించనైనాలేదు.

పిల్లల ప్రవర్తనకు నైతిక బాధ్యత తమదేనని వప్పేసుకున్నారు. లెంపలు వాయించుకున్నారు. క్రమశిక్షణతో పిల్లలను పెంచలేక పోయినందుకు కుమిలిపోయారు.

దేవుడు తనకు సరైన శిక్షే విధించాడని మనసుకి నచ్చ చెప్పుకోవటం వారివంతైంది.

-:(సమాప్తం):-